www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 10 మే 2025
5
తిరుపతి



ఐఎఎస్ సురేష్‌కు ఎంఎల్ఎ ఆదిమూలం సత్కారం

ప్రజాశక్తి - పిచ్చాటూరు



సివిల్స్ లో ర్యాంకు సాధించి ఐఏఎస్ కు ఎంపికైన సురేష్ ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం ఘనంగా సత్కరించారు. నారాయణవనం మండలం గోవిందప్ప నాయుడు కండ్రిగకు చెందిన సురేష్ గత నెల విడుదలైన సివిల్స్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించి ఐఏఎస్ కు ఎంపికైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం గోవిందప్ప నాయుడు కండ్రిగ శివార్లో ఉన్న పడివేటమ్మ ఆలయంలో సురేష్ దంపతులు పొంగళ్ళు పెట్టే కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సురేష్ దంపతులకు శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందించి అభినందించారు. తన సొంత మండలానికి చెందిన యువకుడు సురేష్ ఐ.ఏ.ఎస్ కు ఎంపిక కావడం తనకు గర్వంగా ఉందని ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. అమ్మవారి ఆశీస్సులతో శిక్షణ పూర్తి చేసుకొని విధుల్లో చేరి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

కులగణన సమగ్ర సామాజిక సర్వేగా చేపట్టాలి

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి
బాలల సంఘాల కార్యక్రమాలపై కేంద్రీకరణ
తిరుపతిలో రెండోరోజూ రాష్ట్ర కమిటీ సమావేశాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో,తిరుపతి సిటి

కులగణన సమగ్ర సామాజిక సర్వేగా చేపట్టాలని సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి అన్నారు. కులగణన కేవలం బీహార్ ఎన్నికలను దష్టిలో ఉంచుకుని కేంద్రం ప్రకటించిందన్న భావన ప్రజల్లో ఉందని, కేంద్రం కులగణన చేపట్టేందుకు అవసరమైన మార్గదర్శకాలు ఇప్పటి వరకు ప్రకటించకపోవడం దీనిని బలపరుస్తోందని తెలిపారు. కులగణన సమగ్ర సామాజిక సర్వేగా చేపట్టాలని, అందుకు అవసరమైన మార్గదర్శకాలను రూపొందించాలని డిమాండు చేశారు. రానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో సిపిఎం దీనిపై చర్చ లేవనెత్తనుందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు 8-10 తేదీల్లో తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం విలేకరుల సమావేశంలో ఎంఎ బేబి మాట్లాడుతూ తీవ్రవాదం అంతానికి, పెహల్గాం హంతకులను అప్పజెప్పడానికి పాకిస్తాన్ పై వివిధ వేదికల ద్వారా వత్తిడి తీసుకురావాలని అన్నారు.

తమిళనాడు మదురైలో నిర్వహించిన 24వ మహాసభల్లో తాను ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యానని, అనంతరం దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల్లో పార్టీ. 'నాయకులను కలుసుకుని వారితో స్థానిక విషయాలపై చర్చిస్తూ పర్యటిస్తున్నానని పేర్కొన్నారు. ఇప్పటికే పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో పర్యటించానని ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర కమిటీ సమావేశాల్లో పాల్గొనేందుకు తిరుపతికి వచ్చానని తెలిపారు. 24వ పార్టీ అఖిలభారత సమావేశాల్లో దేశ అభివద్ధికి, సమైక్యతకు, సమగ్రతకు ముప్పు కలింగించేలా పెచ్చరిల్లుతున్న మతతత్వ శక్తులను ఎదుర్కొనే ప్రధాన లక్ష్యంతో సిపిఎం పోరాటాలు చేయాలని తీర్మానించి నట్లు తెలిపారు. గ్రామీణ పేదలు, పట్టణ పేదలు, రైతులు, కార్మికులు, దళితులు, ఆదివాసీలు అన్ని వర్గాలను చైతన్య పరిచేలా ఉద్యమిస్తామని చెప్పారు. ప్రస్తుతం బాలల మీద గణనీయమైన మతతత్వ పోకడలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిని చైతన్య పరిచేందుకు బాలల సంఘాల కార్యక్రమాలపై కూడా కేంద్రీకరించి పని చేయనున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వి. నాగరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి పాల్గొన్నారు.



ఎంఎ బేబిని కలిసి చిరు సత్కారం అందించిన విశ్వనాథరెడ్డి, మోహన్‌రాజు

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి
ఎంఎ బేబికి చిరు సత్కారం

ప్రజాశక్తి - క్యాంపస్

సిపిఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ తిరుపతికి వచ్చిన సందర్భంగా విశ్వం ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఛైర్మన్ డా. ఎన్. విశ్వనాథరెడ్డి, ఎస్.వి డిజిటల్స్ ఛైర్మన్ మోహన్ రాజు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంలో వారు గౌరవప్రదంగా ఆహ్వానించి, చిరు సత్కారం చేశారు. సమాజంలో విద్య, సేవా కార్యక్రమాలు, ప్రగతిశీల ఆలోచనలు కలిగిన ప్రముఖులను కలవడం ఎంతో సంతోషకరమని వారు పేర్కొన్నారు. కామ్రేడ్ బేబీ తమ ఆశయాలను వివరిస్తూ, యువతకు ప్రేరణ కలిగించేలా ప్రసంగించారు.



తిరుమల కొండపై ఏరియా డామినేషన్ తనిఖీలు

ప్రజాశక్తి -తిరుమల

దేశ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో తిరుమల భద్రతను ప్రభుత్వం పటిష్ఠ చేసింది. శుక్రవారం నిత్యం రద్దీగా ఉండే తిరుమలలో అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ ముందుస్తు చర్యలు చేపట్టింది. పెహల్గాం దాడుల అనంతరం భద్రత బలగాలు, పోలీసు, విజిలెన్స్ సంయుక్తంగా మాక్ డ్రిల్స్ నిర్వహించాయి. దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నెలకొనడంతో తిరుమల భద్రతపై ప్రత్యేక దష్టి సారించారు. తిరుమల గిరుల్లోభద్రతా దళాలు నిరంతరంగా గస్తీ చేస్తున్నారు. పోలీసులు, విజిలెన్స్, భద్రత బలగాలు సంయుక్తంగా ఏరియా డామినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర నిఘా వర్గాల సూచనలు మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని తిరుమల డీఎస్పీ విజయ శేఖర్ తెలిపారు. దేశంలో ముఖ్యమైన ప్రాంతాల్లో జాబితాలో తిరుమల ఉండటంతో డీజీపీ హరీష్ గుప్తా ఆదేశాల మేరకు తిరుమలలో ఏరియా డామినేషన్ గస్తీ చేశామన్నారు. ఈ గస్తీను నిరంతరంగా కొనసాగిస్తామన్నారు. ఆక్టోపస్ బలగాలు, విజిలెన్స్,పోలీసులు కలిపి నాలుగు బందాలుగా 138 మంది తనిఖీలు చేస్తున్నామన్నారు.

స్నేహశీలి ప్రేమావతి కన్నుమూత

ప్రజాశక్తి - తిరుపతి సిటి



సాహితీవేత్త, స్నేహశీలి, విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ డి.ప్రేమావతి (83) శుక్రవారం ఉదయం కన్నుమూశారు. సోమవారం తెల్లవారుజాము నుంచి తిరుపతి స్విమ్స్‌లో వెంటిలీటర్‌పై చికిత్స పొందుతూ, బ్రెయిన్‌డెడ్ కావడంతో వైద్యులు చేసిన ప్రయత్నం ఫలించలేదు. శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో తిరుపతి గోవిందధామంలో అంత్యక్రియలు జరపడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. దాశరథి రంగాచార్య నవలలపై పరిశోధన చేసిన ప్రేమావతికి సాహితీప్రియులు కెవి రమణారెడ్డి, త్రిపురనేని మధుసూదనరావు వంటి ప్రముఖ సాహితీ వేత్తలతో వారికి స్నేహ సంబంధాలు ఉండేవి. ప్రముఖ కథా రచయిత ఆచంట శారదాదేవి ప్రేమావతికి గురువు మాత్రమే కాదు, సహ అధ్యాపకురాలు. చిత్తూరు జిల్లా బొమ్మసముద్రం సమీపంలోని నంగమంగళంలో రైతు కుటుంబంలో 1942లో ప్రేమావతి పుట్టారు. తిరుపతిలోనే చదువుకోవడం, అధ్యాపకురాలిగా స్థిరపడ్డారు. ప్రేమావతి తాతగారు కెఎంరెడ్డి రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ప్రియశిష్యులు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో కెఎం రెడ్డి బొంబాయి వెళ్లి కమ్యూనిస్టు పార్టీలో చేరారు. 1948లో నంగమంగళంలో పూరిపాకలు నిర్మించి పాఠశాల స్థాపించారు. 20 గ్రామాలు తిరిగి రైతులందరికీ నచ్చజెప్పి ముఖ్యంగా ఇంటింటికి తిరిగి ఆడపిల్లల్ని ఆ స్కూల్లో చేర్పించారు. ఆ బొమ్మసముద్రం స్కూల్లోనే తొలుత ప్రేమావతి చదువుకున్నారు. ఎస్‌పిడబ్ల్యు కాలేజీలో తెలుగు లెక్చరర్ గా 1965లో చేరిన ప్రేమావతి, రీడర్ గా 2000లో రిటైరయ్యారు. తనను ఇంత దాన్ని చేసిన ఎస్పీడబ్ల్యు కాలేజీ గురించి 'నేను, నా కళాశాల' అంటూ పుస్తకం రాసి, కాలేజీ రుణం తీర్చుకున్నారు. డాక్టర్ ప్రేమావతి విద్యావేత్త, సాహితీ వేత్త మాత్రమే కాదు గొప్ప స్నేహశీలి. ప్రేమావతి లేని లోటు తిరుపతికి లోటుగానే మిగిలిపోతుంది.

పలువురి సంతాపం

తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని శ్రీ పద్మావతి డిగ్రీ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ డా. డిఎం ప్రేమావతి శుక్రవారం ఉదయం పరమపదించటం చాలా బాధాకరం అని ప్రస్తుత కళాశాల అధ్యక్షులు డా. టి.నారాయణమ్మ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి తర్వాత తల్లిలాగా పలకరించేవారని, తాజాగా మేడే శుభాకాంక్షలు తెలిపారని పేర్కొన్నారు. వేమన విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు ఎం.నాగార్జున ప్రేమావతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.



ప్రేమావతి పనిచేసిన స్కూలు



టిటిడి పరిపాలనా భవనం వద్ద నిరసన

భారత సైనికులకు వినయంగా సెల్యూట్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

భారతదేశ ప్రతిష్టను కాపాడుతున్న సైనికులకు కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి మద్దతు తెలియజేస్తున్నామని, వినయంగా సెల్యూట్ చేస్తున్నామని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. టిటిడి పరిపాలనా భవనం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. గత ఏడాది టిటిడి పరిపాలనా భవనం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో 30 సార్లు ఆందోళన చేశామన్నారు. టీటీడీ లో పనిచేసే అర్చకులకు, శాశ్వత ఉద్యోగస్తులకు, వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మరోసారి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కొండపై దాదాపు 500 అంగళ్లు ఉన్నాయని, వాటిలో ఒక్కరైనా ఎస్సీ, ఎస్టీలు లేరని, జనాభా నిష్పత్తి ప్రకారం 500 అంగళ్లను కేటాయించాలని కోరారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కుప్పంలో ద్రవిడ యూనివర్సిటీలో సంవత్సర కాలంగా జీతాలు ఇవ్వలేదన్నారు. ఎస్వీయూలో ప్రొఫెసర్లకు మూడు నెలలుగా జీతాల్లేవన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి గౌడ్, రవి, తేజోవతి పాల్గొన్నారు.



పూసలవీధి కూడలిలో అమరవీరుడు మురళినాయక్ చిత్రపటానికి నివాళి

'వందేమాతరం' అని నినదించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

భారతదేశ సమగ్రతను దెబ్బతీయాలని చూస్తున్న పొరుగు దేశమైన పాకిస్తాన్ కుట్రలను అడ్డుకోవడానికి మనందరం కలిసికట్టుగా భారత ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని, అందులో భాగంగానే ప్రతి ఒక్క భారతీయుడు వందేమాతరమంటూ నినదించాలని టీడీపీ బీసీ విభాగం నాయకులు పిలుపునిచ్చారు. అభివద్ధి పథంలో వేగంగా ముందుకు వెళుతున్న భారతదేశాన్ని చూసి ఓర్వలేని పాకిస్తాన్ తన కుట్రపూరితమైన వైఖరితో తీవ్రవాదాన్ని పెంచి పోషిస్తూ, ముష్కర మూకలను మన దేశంలోకి జొప్పించి అస్థిర పరచాలన్న కుట్రను భగ్నం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రతి చర్యకూ యావత్ భారతదేశం అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళి నాయక్ కు శుక్రవారం స్థానిక పూసల వీధి కూడలిలో ఆయన చిత్రపటాన్ని ఉంచి నివాళులు అర్పించారు. నాయకులు డా.జి.దశరధాచారి, రెడ్డివారి గురవారెడ్డి, మిన్నల్ రవి, గాలి మురళి నాయుడు, రావిళ్ళ మునిరాజా నాయుడు పాల్గొన్నారు.

వైజాగ్ - చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్..
భూసేకరణ పెండింగ్ పనులు వెంటనే చేపట్టాలి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



వైజాగ్ - చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైజాగ్ చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధిపై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో సమీక్ష నిర్వహించారు. వర్చువల్ విధానంలో సబ్‌కలెక్టర్ రాగవేంద్ర మీనా, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీవోలు కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, సంబంధిత తహశీల్దార్‌లు పాల్గొన్నారు. వైజాగ్ - చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్, ఎపిఐఐసి అభివృద్ధి పనుల్లో భాగమైన పలు ఇండస్ట్రియల్ కారిడార్ సంబంధించి భూసేకరణ, సిబిఐసి, విసిఐసి భూములు, ఎడిబి రోడ్లు తదితర పనులు, వాటర్ పైప్‌లైన్లు, రోడ్లు తదితర అంశాలపై రెవెన్యూ, ఆర్ అండ్‌బి శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. నాయుడుపేట, మేనకూరు మండలాలకు సంబంధించిన గ్రామాల్లో భూసేకరణ పెండింగ్, రోడ్ల పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శివకుమార్, ఆర్ అండ్ బి ఎస్ ఈ మధుసూదన్ రావు పాల్గొన్నారు.



'కియా ఇండియా' తో తిరుపతి ఐఐటి ఎంఓయూ

ప్రజాశక్తి -ఏర్పేడు

దేశంలోని ప్రముఖ మాస్ ప్రీమియం కార్ల తయారీ సంస్థ అయిన కియా ఇండియా, ఇంజనీరింగ్ ఎక్సలెన్స్‌ను పెంపొందించడం, పరిశోధన-నేతత్వంలోని ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ఆటోమోటివ్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ రంగాలలో భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను పెంపొందించడం లక్ష్యంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి-తిరుపతి)తో ఒక అవగాహన ఒప్పందం (ఎం ఓ యు)పై సంతకం చేసింది. ఐఐటి -తిరుపతిలో క్రాస్-డిసిప్లినరీ ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి రూపొందించబడిన అత్యాధునిక సహకార స్థలం అయిన అంకితమైన 'మేకర్స్ లాబొరేటరీ'ని సష్టించడం ఈ భాగస్వామ్యం యొక్క ముఖ్యాంశం. ఈ కార్యక్రమంలో కియా ఇండియా మేనేజ్మెంట్ డైరెక్టర్ గ్యాంగు లీ, ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ, జాంగ్వాన్ సియో, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్‌డాంగ్ లీ, కియా నుండి అనేక మంది సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ నాయకత్వం, ప్రొఫెసర్లు శశిధర్, వెంకటరమణ బదర్లా, డీన్లు పాల్గొన్నారు.

రైలు నుండి జారిపడి..
యువకుడు మృతి



ప్రజాశక్తి -దొరవారిసత్రం

సిర్పూర్ -కోయంబత్తూర్ ఎక్స్ ప్రెస్ రైలు నుండి ఓ ప్రయాణికుడు జారిపడి మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది.సూళ్లూరుపేట జి ఆర్ పి,ఎస్ఐ చెన్నకేశవులు సమాచారం మేరకు... దొరవారిసత్రం మండల పరిధిలోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద ఓ గుర్తు తెలియని మతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇచ్చారు. తీవ్రంగా గాయపడి ఉన్న ఆ వ్యక్తి వద్ద ఉన్న టిక్కెట్ వివరాలు పరిశీలిస్తే అస్సాం రాష్ట్రానికి చెందిన కచార్ జిల్లా, సి చార్ ప్రాంతానికి చెందిన వాడుగా గుర్తించారు. ఆ ప్రాంతం నుండి తమిళనాడు రాష్ట్రంలోని కాట్పాడి వెళుతున్నట్లు రైల్వే టికెట్ ద్వారా నిర్ధారించారు. రైలు నుండి జారిపడిన గుర్తు తెలియని వ్యక్తి (35) వయసు కలిగి ఉన్నట్లు నిర్ధారించారు. తీవ్ర గాయాల పాలు కావడంతో స్థానికులు 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం సూళ్లూరుపేటకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్సై చెన్నకేశవులు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట సిహెచ్సికి తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు వివరాలు వెల్లడించారు.

'ఏపీపీఎస్సీ' గ్రూప్ 1 పరీక్షకు 607 మంది హాజరు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ జిల్లాలో శుక్రవారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, ఈ పరీక్షలకు మొత్తం 911 మంది అభ్యర్థులకు గాను 607 (66.63శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్ ఎస్ తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరం, తాగునీరు, మౌలిక సదుపాయాలు ఏర్పాట్లను చేశారన్నారు. వేసవి ఎండల దష్ట్యా పరీక్షలు రాసే విద్యార్థులు అస్వస్థతకు గురికాకుండా తక్షణం వైద్య సేవలు అందించేందుకు ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచామని తెలిపారు.

సంప్రదాయబద్ధంగా గంగమ్మ జాతర

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

సాంప్రదాయ పద్ధతిలో గంగమ్మ జాతర కార్యక్రమం నిర్వహించడానికి చర్యలు తీసుకున్నట్లు తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ ఎన్ మౌర్య తెలిపారు శుక్రవారం తుడా విసి చాంబర్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. గతంలో గంగమ్మ జాతర సాంప్రదాయ పద్ధతిలో ఎలా నిర్వహిస్తున్నారో ఇపుడూ అలాగే నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 12 13వ తేదీన గంగమ్మ జాతర పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నాయని, అమ్మవారిని దర్శించుకునేవారు పొంగళ్ళు పెట్టుకునే వారికి మున్సిపల్ ఇందిర ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ వద్ద సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. తుడా గ్రౌండ్ లో వాహనాల పార్కింగ్ వంటి సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. క్యూలైన్ పద్ధతిలో అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. టీటీడీ, తుడా, మున్సిపల్ కార్పొరేషన్, పోలీస్ విభాగంతో పాటు ఎస్పీడీసీఎల్, దేవదాయ శాఖ తో పాటు మరికొన్ని ప్రభుత్వ విభాగాలతో కలిసి సమన్వయంగా పనులు చేస్తున్నట్టు వెల్లడించారు. ప్రజలందరూ జాతర సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రశాంతంగా గంగమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

సారె తెచ్చిన భూమన అభినయ్‌రెడ్డి

మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మాజీ మేయర్, వైసీపీ నాయకులు భూమన అభినయ్ రెడ్డి శుక్రవారం గంగమ్మ తల్లికి సారె తీసుకొచ్చారు. పద్మావతి పురంలో ఆయన ఇంటి నుంచి ఊరేగింపుగా సారె తీసుకొచ్చి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కుమారుడు భూమన శ్రీవీర్ ఆధ్యాంత్ ఉన్నారు.

తోటి వేషంలో దర్శించుకున్న భక్తులు

గంగమ్మ జాతరలో భాగంగా మూడో రోజు శుక్రవారం భక్తులు తోటి వేషాలు వేసి ఆలయం వద్ద అలరించారు. అమ్మవారి జాతరలో తోటివేషం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కులమతాలకు సంబంధం లేకుండా కోరికలు నెరవేరిన వారు ప్రత్యక వేషాలతో అమ్మను దర్శించుకుంటారు. బొగ్గ పొడిని ఒళ్ళంతా పూసుకుని.. తెల్లనామం సాది కనుబొమ్మలపైన చుక్కబొట్లు పెట్టుకుని... వేపాకు మండలను కట్టుకుని బూతులు తిడుతూ సంచరిస్తే గంగమ్మ పరవశించి తమ కోర్కెలు తీరుస్తుందని భక్తుల విశ్వాసం. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.




గంగమ్మకు సారె సమర్పించిన అభినయ్‌రెడ్డి

ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్లు జైలుశిక్ష


- రూ.3లక్షల జరిమానా
- ఆర్ఎస్ఎస్ ఎడిజె కోర్టు న్యాయమూర్తి తీర్పు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 3లక్షల జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు నిచ్చారు. ఆర్ఎస్ఎస్టీఎఫ్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పకడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 56/2018 కేసులో ఒక ముద్దాయి అరెస్టయ్యాడు. ఇతను



తమిళనాడుకు చెందిన విజయకుమార్ కాగా, ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ నాగపట్ల ఈస్ట్ బీటు, తిరుపతి డివిజన్ లో పట్టుబడ్డాడు. ఈ కేసు విచారణ పూర్తి చేసుకోవడంతో గత నెల 22వ తేదీన న్యాయమూర్తి శిక్ష ఖరారు చేయగా, ఇతను కోర్టుకు హాజరు కాలేదు. దీంతో అతనిపై నాన్ బెయిలబుల్ వారెంట్ (ఎన్ బీడబ్ల్యూ)ను జారీ చేశారు. పోలీసులు ఇతనిని పట్టుకుని, శుక్రవారం న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. న్యాయమూర్తి స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 3లక్షల జరిమానాను ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులో అతి విలువైన సహజ సంపద అయిన ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడమే కాకుండా, అడవిలోకి అక్రమ ప్రవేశం చేసిన నేరస్తులకు కూడా ఇది ఒక హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు అధికారులు తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని అభినందించారు.



కూటమికి 2.0 చూపిస్తాం : బియ్యపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తాము అధికారంలోకి వస్తే మమ్మల్ని ఇబ్బందులు పెట్టిన అధికారులకు, నాయకులకు 2.0 చూపిస్తామని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి హెచ్చరించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో తొట్టంబేడు మండల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తుందని మండిపడ్డారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా అక్రమ కేసులు బనాయిస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి జిల్లా కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, అల్లెయ్య, మణి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల యూనియన్ ప్రారంభం

ప్రజాశక్తి -దొరవారిసత్రం: దొరవారిసత్రం మండలంలోని పలు గ్రామాల ఆటో కార్మికులు కార్మిక సంఘం ఏర్పాటు చేసుకున్నారు. శుక్రవారం ఏకొల్లు, కుప్పారెడ్డిపాళెం, అక్కరపాక గ్రామాల ఆటో యజమానులు ఏర్పాటు చేసుకున్న సిఐటియు కార్మిక అనుబంధ సంఘాన్ని సిఐటియు నియోజకవర్గ నాయకుడు లక్ష్మయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులకు ఏ సమస్య ఎదురైనా పోరాటానికి సంఘటితంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఐటియు మండల అధ్యక్షుడు కరీమ్, కార్యదర్శి వెంకటరమణ, ఆటో కార్మికులు, ఏకొల్లు మాజీ ఎంపీటీసీ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి, తిరుచానూరు సెక్షన్‌లోని 33/11 కె.వి పద్మావతి పురం ఫీడర్ నిర్వహణకు శనివారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపిఎస్‌పిడిసిఎల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ ఈఈ చిన్నకోటేశ్వర్ రావ్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. హోటల్ గ్రాండ్ రిడ్జ్, కొత్తపల్లి లేఔట్, మార్కెట్ యార్డ్, తిరుచానూరు, దామినేడు కలెక్టర్ ఆఫీస్, పద్మావతి పురం, తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజాశక్తి - పిచ్చాటూరు: నేడు రెండవ శనివారం, విద్యుత్ సబ్ స్టేషన్‌లో వివిధ పరికరాల నిర్వహణ కార్యక్రమం జరుగుతుందని, ఈ కారణంగా ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సుబ్రమణ్యం వెల్లడించారు.

ప్రజాశక్తి - సత్యవేడు: మండలంలోని సత్యవేడు, దాసుకుప్పం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు ప్రశంస

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, సెనేట్ హాల్‌లో ప్రజా కళావేదిక, యూనివర్సిటీ సాంస్కృతిక విభాగం వారు సంయుక్తంగా నిర్వహించిన మన పల్లె జానపద పోటీల్లో పుత్తూరు తాసిల్దార్ కార్యాలయంలో ఏఎస్ఓగా విధులు నిర్వహిస్తున్న చల్ల మునిలక్ష్మయ్య విజేతగా నిలిచారు. ఆయనను యూనివర్సిటీలో శుక్రవారం ఘనంగా సత్కరించి, మెమెంటో, ప్రశంసా పత్రం అందజేశారు.



తాగు నీటి సమస్య లేకుండా చూడాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఇరిగేషన్, ఆర్డబ్ల్యుఎస్ అధికారులతో శుక్రవారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా నియోజకవర్గంలో ప్రజలకు తాగు నీటి సమస్య లేకుండా చూడాలని, బోర్లు, మోటార్లు రిపేర్లు ఉంటే వెంటనే సరిచేయాలని సూచించారు. నీరు అందని గ్రామాలకు పైప్ లైన్లు వేయించాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ ద్వారా మంజూరయిన ఎస్.ఆర్ పనులను సాగు నీటి సంఘం అధ్యక్షుల ద్వారా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు, ఆర్డబ్ల్యుఎస్ డిఈ వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తున్నదని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. చంద్రగిరి మండలంలో రాష్ట్ర ప్రభుత్వం రాయితీతో రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు, పాడి రైతులకు పశువుల సబ్సిడీ దాణా పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రగిరి మండలంలోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం 370 పశువుల దాణా బ్యాగ్‌లను మం జూరు చేసిందని తెలిపారు. మే నెలాఖరులో అన్నదాత సుఖీభవ 20,000 రూపాయలు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వ నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీ దాణా పంపిణీ

ప్రజాశక్తి -పిచ్చాటూరు: మండలంలోని పాడి రైతులకు సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. శుక్రవారం పిచ్చాటూరు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పశువుల దాణా సబ్సిడీతో ఇస్తుందని పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న పాడి రైతులు సబ్సిడీ దాణా పొందవచ్చు అన్నారు అని తెలిపారు. 50 కేజీల పశువుల దాణ బ్యాగు 1110 రూపాయలు కాగా ఇందులో 50 శాతం సబ్సిడీ పోను పాడి రైతులు 555 రూపాయలు చెల్లించాల్సి ఉందన్నారు. దశల వారీగా 450 కిలోల దాణాను పాడి రైతులకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య శాఖ ఏడీ ప్రసాద్, వైద్యులు మంజుల, ఎంపీడీఓ మహమ్మద్ రఫీ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇలంగోవన్ రెడ్డి, పద్మ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్యవేడు: తెల్ల రేషన్ కార్డు ఉన్న పాడి రైతులకు సబ్సిడీ ధరలపై ప్రభుత్వం పశువుల దాణా సరఫరా చేస్తుందని సత్యవేడు మండలం ఇరుగుళం పశువైద్యాధికారి డాక్టర్ దయాకర్ పేర్కొన్నారు. పశువుల ఆరోగ్యం, ఉత్పత్తిని కాపాడాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సబ్సిడీ ధరలకు దాణా పంపిణీ చేస్తుందన్నారు.

ఉపాధి కూలీలు విరివిగా పనులకు రావాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, నీర్పకోట పంచాయతీలో ఉపాధి హామీ కూలీలతో శుక్రవారం ఎంపీడీఓ వెంకటరత్నమ్మ మాట్లాడుతూ 10 మంది కూలీలు ఒక గ్రూప్‌గా ఏర్పడి ముగ్గురు గడ్డపార పని, మరో ముగ్గురు పారతో బుట్ట గిన్నెలకు మట్టి పోస్తూ, 4గురు కూలీలు మట్టిని మోస్తూ రోజూ వారి కొలతల ప్రకారం పని చేసి 300 రూపాయలు రోజువారి వేతనం పొంది ఆర్థిక స్థితి మెరుగు పరచుకోవాలన్నారు. రైతులకు మొక్కలు పంపిణీ చేయడం జరుగుతుందని, ఆర్థిక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతిపై పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గ్రేడ్ 3 నుండి గ్రేడ్ 2 కి పదోన్నతి కల్పిస్తూ 160 మంది పంచాయతీ కార్యదర్శులను బదిలీలు చేస్తూ పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ వీరా కృష్ణతేజ మైలవరపు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. అనంతపురం, కర్నూల్, తిరుపతి, వైయస్సార్ కడప, చిత్తూరు, అన్నమయ్య, నంద్యాల, శ్రీ సత్యసాయి జిల్లాలకు సంబంధించిన గ్రేడ్ 3 పంచాయతీ కార్యదర్శులను గ్రేడ్ 2 గా పదోన్నతి కల్పించారు. తిరుపతి జిల్లాకు సంబంధించి వివిధ జిల్లాల నుండి 15 మంది పంచాయతీ కార్యదర్శులు పదోన్నతిపై తిరుపతి జిల్లాకు రానున్నారు. తిరుపతి జిల్లాకు అత్యధికంగా కర్నూలు జిల్లా నుండి కార్యదర్శులు రానున్నారు. పదోన్నతి ఉత్తర్వులు అందుకున్న వారు 15 రోజులలోపు విధుల్లో చేరవలసి ఉంటుందని, ఈ ఉత్తర్వులు వారికి వర్తించదని జీవోలో పేర్కొన్నారు. పదోన్నతి పొందిన కార్యదర్శులను పాత స్థానం నుంచి రిలీవ్ చేసి, వారికి పోస్టింగులను ఇవ్వాల్సిందిగా జిల్లా కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులను సూచించారు.

పోలేరమ్మ జాతర.. నిబంధనలకు పాతర

▪ రాను రాను సంప్రదాయాలకు స్వస్తి ▪ అధికార పార్టీ సూచనలే శిరోధార్యం ▪ దేవాదాయ శాఖ అధికారి హల్ చల్ ▪ హుండీ లెక్కింపూ రహస్యమే

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేటలో 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నాలుగు రోజులు పాటు పోలేరమ్మ జాతర నిర్వహించారు. గతంలో గ్రామం సుభిక్షంగా ఉండాలని, నియమ నిబంధనలతో, భక్తి శ్రద్ధలతో జాతర జరిపేవారు. కానీ ఈ సంవత్సరం జాతర నియామాలు మార్చి, ఇష్టమొచ్చినట్లు నిర్వహించారని భక్తులు విమర్శిస్తున్నారు. నాయుడుపేట, పరిసర గ్రామాల ప్రజలు ఎంతో శ్రద్ధగా యేటా ఈ జాతరకు లక్షల్లో హాజరవుతారు. 40 సంవత్సరాల క్రితం నల్లబోతుల నాగరత్నం అనే భక్తుడు, పట్టణంలోని గడియారం స్తంభం కింద అమ్మవారిని ప్రతిష్టించి నిత్యం పూజలు చేసేవారు. పట్టణంలోకి వచ్చే, పోయే వారు చల్లగా చూడమని అమ్మవారిని మొక్కుకుని వెళుతుండేవారు. అలా చిన్న ఆలయంగా ప్రారంభమైన పోలేరమ్మ ఆలయం, ప్రజల్లో నమ్మకం పెరిగి దిన దినాభివృద్ధి చెంది, జిల్లాలో ప్రసిద్ధ క్షేత్రంగా భాసిల్లుతోంది. నాగరత్నం ధర్మకర్తగా, ఆయన ఆధ్వర్యంలో కమిటీ మెంబర్లతో కొన్నేళ్లపాటు పోలేరమ్మ జాతర నియమా నుసారం నిర్వహించబడేది. ఆలయం ఇంకా అభివృద్ధి చెందాలని, ఆలయ ధర్మకర్త, ఆలయాన్ని దేవాదాయ శాఖలో విలీనం చేశారు. దేవాదాయ శాఖ వారి ఆధ్వర్యంలో మొదట్లో 1,2 సంవత్సరాలు జాతర నిర్వహణ సంప్రదాయబద్ధంగా జరిగేది. కానీ దేవాదాయ శాఖ అధికారులు మరే కొద్దీ జాతర నిర్వహణలో మార్పులు చోటుచేసుకున్నాయి. అధికారుల్లో కొందరు తమ జేబులు నింపుకునే ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. ఈసారి జాతర నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ప్రస్తుత దేవాదాయ శాఖ అధికారి రవికృష్ణ ప్రవర్తన భక్తులను విస్మయానికి గురి చేసింది. బాధ్యతగల అధికారి అయిఉండి జాతరలో మద్యం సేవించి హల్‌చల్ చేశారని భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఆయనకు పూర్తిస్థాయిలో బాధ్యతలివ్వ లేదని ఆలయ కమిటీ మెంబర్లపై కూడా అర్థంపర్థం లేని ఆరోపణలు చేయడం విశేషం. రవికృష్ణ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆరేడు నెలల్లో అమ్మవారి హుండీ లెక్కింపు విషయం కూడా రహస్యంగా నిర్వహించినట్లు సమాచారం. జాతర ఖర్చులు, హుండీ లెక్కింపులపై ఈవోను వివరణ అడుగగా పొంతన లేని సమాధానం చెప్పారు. ఛైర్మన్‌ను అడుగగా, తాను కొత్తగా వచ్చానని తనకు తెలియదని సమాధానమిచ్చారు. నెలవల విజయశ్రీ సూళ్లూరు పేట ఎమ్మెల్యే అయ్యాక మొదటిసారి జరుగుతున్న పోలేరమ్మ జాతర కావడంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకూడదని ఆమె అధికారులను అప్రమత్తం చేశారు. ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రమణ్యంల ఆధ్వర్యంలో తాత్కాలిక ఆలయ కమిటీ ఛైర్మన్‌గా నన్నాబాల సుబ్బారావును నియమించారు. జాతర నిర్వహణపై అవగాహనలేని ఛైర్మన్, విధుల్లో కనిపించని దేవాదాయ శాఖ ఈవో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ భక్తులను ఇబ్బందుల పాలు చేశారు. ఏ పార్టీ



అధికారంలో ఉంటే ఆ పార్టీ విధానా లకు తగ్గట్టుగా జాతర నిర్వహిస్తున్నారని గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైస్థాయి నాయకులకు అనుమానం రాకుండా జాతర నిర్వహణ బాధ్యత తీసుకున్న వారు తమ వాళ్లకోసం, తమ మెహర్బానీ కోసం జాతర నిర్వహిస్తున్నారని భక్తులు మండిపడుతున్నారు. ఇలాంటి లోపాలను పర్యవేక్షించాల్సిన దేవాదాయ శాఖ ఈవో తనకు దక్కాల్సింది దక్కితే చాలనే విధంగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తులు అమ్మవారికి సమర్పించుకున్న కానుకలు పక్కదారిపట్టకుండా జాతర నిర్వహణ సంప్రదాయ బద్ధంగా జరిగేలా చూడాలని, నిర్వహణ బాధ్యత సరైన వారికి అప్పగించాలని భక్తులు కోరుతున్నారు.

పల్లెయాసకు జానపదం జీవం: వీసీ అప్పారావు

ఎస్వీయూలో ఘనంగా జానపద జాతర ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : జానపద సాహిత్యం ప్రజల జీవన విధానమని, నమ్మకాలు, సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను ప్రతిబింబిస్తుందని ఎస్వీయూ ఇంచార్జీ ఉపకులపతి ఆచార్య అప్పారావు అన్నారు. స్థానిక భాష, యాసకు జీవం పోసి, ఆయా ప్రాంతాల ప్రత్యేకతను తెలియజేస్తుందని వివరించారు. ప్రజా కళావేదిక, ఎస్వీయూ విద్యార్థుల సంక్షేమం, సాంస్కృతిక వ్యవహారాల డైరెక్టరేట్ సంయుక్త ఆధ్వర్యంలో "మన పల్లె జానపదం జాతర" కార్యక్రమం శుక్రవారం సెనేట్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జీ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు మాట్లాడుతూ రాతపూర్వక రూపం లేని జానపద సాహిత్యం, మౌఖికంగా ఒక తరం నుండి మరో తరానికి అందిందన్నారు. ఒక సమాజం సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, నమ్మకాలు, విలువలను ప్రతిబింబిస్తుందన్నారు. ప్రజల జీవన అనుభవాలు, కష్టాలు, ఆనందాలు, వారి రోజువారీ జీవితాలను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. జానపద గేయాలు, నత్యాలు, ఇతర కళా రూపాల్లో భాగమేనన్నారు. సమకాలీనమైన విషయాలను, ప్రజల ఆలోచనలు, భావనలు, సంఘటనలను ప్రతిబింబిస్తుందన్నారు. జానపద సాహిత్యం స్థానిక భాష, యాసలో ఉంటుందని, ఇది ఆ ప్రాంతం ప్రత్యేకతను తెలియజేస్తుందని వివరించారు. విశిష్ట అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. భూపతి నాయుడు మాట్లాడుతూ జానపద సాహిత్యం ప్రజల మధ్య సామాజిక ఐక్యతను, బంధాలను పెంపొందిస్తుందన్నారు. చిత్తూరు జిల్లా కుప్పంలో 18వ శతాబ్దంలోనే జానపద సాహిత్యం వెలువడిందన్నారు. భారతదేశ స్వాతంత్ర్య సమరంలో మన ప్రాంతం నుంచి విరివిగా చైతన్య గీతాలు రావడం గర్వకారణమన్నారు. జానపద సాహిత్యం ప్రజల నమ్మకాలు, పురాణాలు, మతపరమైన నమ్మకాలను ప్రతిబింబిస్తుందన్నారు. జానపద సాహిత్యం కథలు, పురాణాలు, ఇతర కథన రూపాలను కలిగి ఉంటుందన్నారు. ఆత్మీయ అతిథి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పూర్వ సభ్యులు, ప్రముఖ రచయిత డాక్టర్ విఆర్ రాసాని మాట్లాడుతూ జానపద సాహిత్యంలో సామెతలు, చిక్కులు కూడా ఒక ముఖ్యమైన భాగమన్నారు. జానపద సాహిత్యం ఒక సమాజం సంస్కృతి, చరిత్రను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందన్నారు. ప్రత్యేక అతిథి ప్రముఖ కాలమిస్ట్ నల్లాని రాజేశ్వరి మాట్లాడుతూ మౌఖిక సంప్రదాయాలను కాపాడటానికి, భవిష్యత్తు తరాలకు అందించడానికి ప్రజా కళావేదిక కషి సహాయపడుతుందన్నారు. తొలి రోజు దాదాపు 100 మంది కళాకారులు తమ గళాలను వినిపించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయకులు తమదైన శైలిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ప్రజా కళావేదిక ఛైర్మన్ అరవ జయపాల్, ఎస్వీయూ కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, ఆదిశేషయ్య, ప్రముఖ కవి సురేంద్ర రొడ్డ, గుత్తా హరిసర్వోత్తమనాయుడు, జి.ఎస్. ప్రసాద్, రోజారమణి, నటరాజ నాయుడు, లింగుట్ల వెంకటేశ్వర్లు, ప్రజా కళావేదిక ప్రతినిధులు రావిళ్ళ రజని పాల్గొన్నారు.



నేడు ముగింపు సభ :

ప్రపంచ రికార్డు నెలకొల్పే "మన పల్లె జానపదం జాతర" ముగింపు సభకు ముఖ్య అతిథిగా శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ ఉమ హాజరవుతారని ప్రజా కళావేదిక ఛైర్మన్ అరవ జయపాల్ తెలిపారు. శనివారం ఉదయం జరిగే రెండోరోజు సభకు ముఖ్య అతిథిగా ప్రముఖ రచయిత, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ న్యూస్ ఎడిటర్ ఆర్.ఎం ఉమామహేశ్వర రావు, విశిష్ట అతిథిగా ఏపీ టూరిజం శాఖ ప్రాంతీయ సంచాలకులు రమణ ప్రసాద్, అతిథులుగా ప్రముఖ కవయిత్రి రుయా ఆసుపత్రి సర్జన్ డాక్టర్ రోజా రమణి, ప్రముఖ రచయిత డాక్టర్ వి.ఆర్ రాసాని, ప్రసిద్ధ మిమిక్రీ కళాకారుడు డాక్టర్ విజయకుమార్ హాజరవుతారని చెప్పారు. ప్రత్యేక ఆహ్వానితులుగా డాలర్స్ గ్రాండ్ క్లబ్, గెహిని డెవలపర్స్ అధినేత సి. దివాకర్ రెడ్డి, ఐ.ఆర్.డి.ఎస్ స్వచ్ఛంద సంస్థ అధినేత, విశ్రాంత లెక్చరర్ డాక్టర్ కష్ణారెడ్డి, ప్రముఖ కవి సినీ గీతరచయిత సురేంద్ర రొడ్డ, సమాచారశాఖ తిరుపతి డివిజనల్ పిఆర్ఓ డాక్టర్ కె. ఈశ్వరి, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ పూర్వ సభ్యులు, కవి గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, కవయిత్రులు కరణం విమల, రుక్మిణి రెడ్డి తదితరులు విచ్చేస్తారని తెలిపారు.

సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : గంగ జాతరలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిరంతరం సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గంగ జాతర సందర్భంగా ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం వివిధ శాఖల అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గంగ జాతరను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. 12 వ తేదీ సాయంత్రం నుండి 14 వ తేదీ ఉదయం వరకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేశామని అన్నారు. గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. భక్తులు పొంగళ్ళు పెట్టుకునేందుకు మార్కెట్ లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. భక్తులు అందరూ ప్రశాంతంగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని వెళ్ళాలని అన్నారు. వద్ధులు, వికలాంగులు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాలు లోనికి రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, డీఎస్పీ లు భక్తవత్సలం, రామకష్ణ ఆచారి, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, ఆలయ ఈవో జయకుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసీపీ బాలాజి, తదితరులు ఉన్నారు.



పెండింగ్ డ్రైనేజీ కాల్వలు త్వరగా పూర్తి చేయాలి

నగరంలో పెండింగ్ లో ఉన్న డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను, అఫ్కాన్స్ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. నగరంలోని కొర్లగుంట ఆరోగ్య ఫార్మసీ వద్ద, కరకంబాడి మార్గంలోని సిపిఆర్ అపార్ట్మెంట్ వద్ద, రామానుజ కూడలి నుండి శంకరంబాడి కూడలి వరకు పెండింగ్ లో ఉన్న డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులను స్మార్ట్ సిటీ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ఆప్కాన్స్ సంస్థ ప్రతినిధులతో కలసి శుక్రవారం పరిశీలించారు. గరుడ వారధి డివైడర్ల మధ్యలో ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలని, పూల మొక్కలు నాటి సుందరంగా ఉండేలా చూడాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్ ఉన్నారు.

టిడిఆర్ బాండ్‌లు పంపిణీతో తగ్గిన ఒత్తిడి..

తిరుపతి మాస్టర్ ప్లాన్ రోడ్ల కోసం భూములు తీసుకున్న వారికి టీడీఆర్ బాండ్లను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు సుమారు 300 వరకూ ఇచ్చామన్నారు. మరో 500 మందికి ఇవ్వనున్నట్టు చెప్పారు. 68 మంది సంబంధించిన అడ్రస్‌లు తెలియడం లేదని, వారిని కూడా గుర్తించి బాండ్లు ఇవ్వనున్నట్టు ఎం మౌర్య వెల్లడించారు.

వెబ్‌సైట్‌లో పదవ తరగతి మార్కుల జాబితాలు

ప్రజాశక్తి - రామచంద్రాపురం : పదవ తరగతి రెగ్యులర్ విద్యార్థుల పరీక్షా ఫలితాలను ఏప్రిల్లో విడుదల చేయగా, వాటికి సంబంధించిన మార్కుల జాబితాలు ప్రభుత్వ వెబ్సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కేవియన్ కుమార్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ గురు స్వామి రెడ్డిలు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల లాగిన్ ద్వారా సబ్జెక్ట్ ప్రకారం మార్కుల జాబితాను డౌన్లోడ్ చేసుకోవాలని చెప్పారు. విద్యార్థులకు సంబంధించిన వివరాలు ఏవైనా తప్పులు చోటుచేసుకుని ఉంటే ఈ నెల 25వ తేదీ లోపల ఎస్ఎస్సి బోర్డు, గుంటూరు వారికి తెలియపరచాల్సిన అవసరం ఉందన్నారు.

ఆత్మగౌరవ సభతో సత్తా చాటుదాం: మాలల జేఏసీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వర్గీకరణ పేరుతో మాల, మాదిగల మధ్య చిచ్చు పెడుతూ ఎస్సీ రిజర్వేషన్లు ఎత్తివేసే విధంగా ప్రయత్నం జరుగుతోందని, ఇందుకు ఆదివారం తిరుపతిలో నిర్వహించే మాలల ఆత్మ గౌరవ సభ ద్వారా తమ సత్తా చాటుతామని మాలల జేఏసీ నేతలు స్పష్టం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో జేఏసీ నేతలు మాట్లాడారు. మాలల ఆత్మగౌరవ సభ ఆహ్వాన కరపత్రాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. జేఏసీ గౌరవాధ్యక్షులు అశోకరత్న మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పట్ల న్యాయస్థానం సైతం రాజ్యాంగ విరుద్ధంగా తీర్పు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. మంగళం రోడ్డులోని ఆశ కన్వెన్షన్ సెంటర్లో జరిపే మాలల ఆత్మగౌరవ సభకు ఎమ్మెల్యే వివేక్, దళిత మేధావులు, ప్రజా ప్రతినిధులు జడ శ్రావణ్ కుమార్, హర్ష కుమార్, వేలాదిమంది హాజరవుతారన్నారు. ఈ సభ విజయవంతానికి దళిత సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో దళిత సంఘాల నేతలు, సభ నిర్వాహక కమిటీ సభ్యులు మల్లా రపు మధు, దుర్గా అనే జయరాం, తాళ్లపాక దాము, రాజ్ కుమార్, నాగేంద్ర, రాఘవులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రెండు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని మంగళం క్వార్టర్స్ ఇంటి నెంబర్ 9-265 ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు సీజ్ చేసి తిరుచానూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మంగళం క్లస్టర్ ఇన్చార్జి ఎస్సై జగన్నాథం తెలిపిన వివరాల మేరకు పోలీసులకు అందిన రహస్య సమాచారం మేరకు మంగళం క్వార్టర్స్ ఇంటి నెంబర్ 9-265 యజమాని హరిత వద్ద నుండి సప్తగిరి కాలనీ పంచాయతీ వెంకటేశ్వర కాలనీలో నివాసముండే శ్యాంసుందర్ బాబు ఇంటిని అద్దెకు తీసుకొని అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచారన్నారు. సీజ్ చేసిన బియ్యం దాదాపు రెండు టన్నుల వరకు ఉంటుందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమన్నారు. కాగా మంగళం పంచాయతీలో రామచంద్ర బాబు ప్రజల నుండి రేషన్ బియ్యాన్ని సేకరించడమే కాకుండా, రేషన్ షాపుల నుండి బియ్యం తీసుకున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. దీనిపై పౌరసరఫరాల శాఖ అధికారులు కూడా దృష్టి సారించి సామాన్య మధ్యతరగతి ప్రజలకు అందవలసిన రేషన్ బియ్యాన్ని సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానా

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 9 మంది ముద్దాయిలను 4 వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికి 10,000/- చొప్పున మొత్తం 14 మందికి 14,0000/- జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసుల పనితీరును జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అభినందించినారు.

పోగొట్టుకున్న సూట్ కేస్ అప్పగించిన ఆటో డ్రైవర్

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట రైల్వే స్టేషన్ నుంచి బీహార్‌కు చెందిన నిఖిల్ కుమార్, తిరుచానూరు వెళ్లుటకు రేణిగుంటలో ఆటో ఎక్కి తిరుచానూరులో దిగే క్రమంలో ఆటోలో తన సూట్ కేసును మరిచిపోయాడు. సదరు ఆటో డ్రైవర్ రేణిగుంట, ఎర్రం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన విజయ్ కుమార్ రేణిగుంట పోలీస్ స్టేషన్‌కి వచ్చి సూట్ కేస్‌ని పోలీసులకు అప్పగించాడు. పోలీసులు నిఖిల్ కుమార్‌ను ఫోన్‌చేసి పిలిపించి సూట్ కేస్ అందజేశారు. ఆటో డ్రైవర్ విజయ్ కుమార్ నిజాయితీకి ప్రశంసలు తెలిపారు.



సత్తార్ మరణం తీరని లోటు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ తిరుపతి జిల్లా కార్యదర్శి సత్తార్ మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిపిఎం పార్టీ జిల్లా కమిటీ తరపున సత్తార్ కుటుంబానికి ప్రగాఢమైన సంతాపాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు. సత్తార్ ఉపాధ్యాయ వృత్తి నిర్వహిస్తూ, ఉపాధ్యాయుల సమస్యలపై స్పందించేవాడన్నారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే, నమ్మిన కమ్యూనిస్టు ఉద్యమం కోసం తుది శ్వాస విడిచే వరకు పనిచేశారని కొనియాడారు.

రక్షణ దళానికి రూ.5 లక్షలు విరాళం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఏకె జ్యోతి కృష్ణ, కె.శ్రీనివాసులు నాయుడుల కుమారుడు ఇండియన్ ఆర్మీ, ఎన్సిసి సంక్షేమానికి 25 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఈ ప్రాంతంలోని నేషనల్ క్యాడెట్ కార్ప్స్‌కి 5 లక్షల రూపాయలు విరాళంగా అందించారు. ఈ ముఖ్యమైన సహకారం దళాల దళాల సంక్షేమం, శిక్షణ కార్యక్రమాలు, శిబిరాలు, క్యాడెట్ల సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలకు మద్దతివ్వడంలో చాలా దూరంగా ఉంటుంది. ఈ సందర్భంగా కల్నల్ సతీందర్ దహియా గ్రూప్ కమాండర్, ఎన్సిసి గ్రూప్ హెడ్క్వార్టర్స్ తిరుపతి, అందరు అధికారులు, క్యాడెట్ల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి ముక్కంటి దర్శనార్థమై శుక్రవారం పలువురు ప్రముఖులు విచ్చేశారు. రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కర్నూల్ జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా కుటుంబ సమేతంగా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సంప్రదాయ స్వాగతం పలికారు. దర్శనానంతరం స్వామి అమ్మవార్ల జ్ఞాపికలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శాశ్వత ఉపకులపతిని నియమించండి

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో ఏడాది కాలంగా తాత్కాలిక ఇంచార్జ్ పరిపాలనలో కొనసాగుతూ, పరిపాలనా వైఫల్యాలతో అస్తవ్యస్తమవుతోందని కామిరెడ్డి తరుణ్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినప్పటికీ శాశ్వత ఉపకులపతి నియామకం జరగకపోవడం విశ్వవిద్యాలయ పరిపాలనపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిపాలన భవనంలో స్థానచలనాలను అనుకూలంగా వేయించుకొని అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నా ఉన్నతాధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. యూనివర్శిటీ సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పరిపాలన సక్రమంగా నిర్వహించేందుకు శాశ్వత ఉపకులపతిని నియమించాలని కోరారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్ వెంకటేశ్వర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు, సత్యవేడు: సత్యవేడు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లుకు విన్నవించారు. శుక్రవారం సాయంత్రం తిరుపతి, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుడా నిధులతో పిచ్చాటూరు ఆరణియార్ వద్ద నిర్మిస్తున్న టూరిజం పనులు పూర్తి చేయడానికి అదనంగా రూ.40 లక్షలు నిధులు కేటాయించాలని కలెక్టర్‌ను కోరానన్నారు. స్పందించిన కలెక్టర్ వెంటనే తుడా వైస్ చైర్మన్ మౌర్య రెడ్డికి ఫోన్ చేసి నిధులు మంజూరుకు సహకరించాలని సూచించారని తెలిపారు. సత్యవేడు మండలంలో ఏం.ఐ.జీ భూములను తుడా నిధులతో అభివృద్ధి చేసి తక్కువ ధరకు పేదలకు పంపిణీ చేయాలని కోరగా, వెంటనే స్పందించి భూములను పరిశీలించి చర్యలు తీసుకోవాలని జేసీ శుభం భన్సాల్‌కు కలెక్టర్ సూచించారని తెలిపారు. నారాయణవనం మండ లంలో ఎకో పార్క్ ఏర్పాటుకు నిధులు కేటాయించాలని, సురుటుపల్లితో పాటు నియోజకవర్గంలో అత్యవసరమైన చోట్ల రోడ్లు నిర్మాణం చేపట్టాలని కలెక్టర్‌ను కోరామని తెలిపారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం, బట్టి కండ్రిగ నుంచి నారాయణపురం గ్రామం వరకు, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం నిధులు 5 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జానా వెంకటయ్య, టిడిపి జిల్లా నాయకులు ధనంజయులు నాయుడు, మహిళా జిల్లా నాయకులు లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన మేనేజర్‌కు సత్కారం



ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ మేనేజర్ అరుల్ దాసన్ను శుక్రవారం ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు ఆధ్వర్యంలో సర్పంచ్ నగేషం, మండల కో ఆప్షన్ మెంబర్ హసన్ సాహెబ్, తులసి రాజన్, సి హెచ్ ఐజయ్య మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జూలియన్ రాజు మాట్లాడుతూ అసిస్టెంట్ బ్యాంక్ మేనేజర్ గా ఐ ఓ బి బ్యాంకు తో తనకున్న అనుబంధాన్ని తెలిపారు. రేణిగుంట ఐ ఓ బి బ్యాంకుకు గొప్ప పేరు ఉందని అన్నారు. మన ఖాతాదారుల మద్దతుతో బ్యాంకును ప్రగతి పథం లో తేవాలని కోరారు.

ప్రజారోగ్యానికే ప్రాధాన్యత



ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి - రామచంద్రపురం(చంద్రగిరి) ప్రభుత్వం ప్రజా ఆరోగ్యం వైపు వడివడిగా అడుగులు వేస్తున్నదని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చంద్రగిరి మండలం కొటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24/7 వైద్యులు అందుబాటులో ఉండి చికిత్సలు నిర్వహించడానికి ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంయస్ చైర్మెన్ సుబ్రమణ్యం నాయుడు, చంద్రగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గౌస్ బాషా, గ్రామ సర్పంచ్ గంగులమ్మ, ఎంపీటీసీ మధు పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వి.కె. షోరూమ్ అధినేత మల్లికార్జున దాతృత్వంలో ఆసుపత్రికి వచ్చే పేదలకు డాక్టర్ షరీనా, డాక్టర్ రాజా చేతుల మీదుగా పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, చెంచునారాయణ, పురుషోత్తమరావు, రామమోహన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో పూజలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, జడ్పీ హైస్కూల్ రోడ్‌లో వెలసిన శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గోవిందరాజస్వామివారి ఆలయంలో బుగ్గోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయంలో శుక్రవారం బుగ్గోత్సవం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ ఉత్సవంలో మొదటిరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి విశ్వరూప దర్శనం కల్పించారు. అనంతరం శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలోని బుగ్గ వద్దకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని వేంచేపు చేశారు. మధ్యాహ్నం 2.30 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సమర్పణ, ఆస్థానం నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు ఉభయనాంచారులతో కలిసి శ్రీవారి ఊంజల్ సేవ, అనంతరం బుగ్గ వద్దకు ఊరేగింపుగా వచ్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం 6 గంటలకు మహలక్ష్మీ అమ్మవారి ఆలయం వద్ద ఆస్థానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ చిరంజీవి, ఆలయ ఇన్స్పెక్టర్ రాధాకృష్ణ ఇతర అధికారులు, విశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపు తిరుమలలో శ్రీ నృసింహ జయంతి

ప్రజాశక్తి - తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం నృసింహ జయంతి నిర్వహించనున్నారు. ప్రతి ఏటా వైశాఖ మాసం స్వాతి నక్షత్రంలో నృసింహ జయంతిని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీ యోగ నరసింహ స్వామివారి మూలమూర్తికి ప్రత్యేక అభిషేకం చేస్తారు.

మజ్జిగ, ఐస్ క్రీమ్ పంపిణీ



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణపరిధి, తిరుపతి రోడ్డులో ఉషోదయ వాకర్స్ డిస్ట్రిక్ 302 అసోసియేషన్ తరపున ప్రజలకు అంబలి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కోనేటి రవిరాజు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ నాయకులు చంద్రబాబు, లోకనాథం నాయుడు, విష్ణు రాజు, శివరాజు, వాకర్ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ గ్రామ అధ్యక్షుల ఎన్నికల ప్రక్రియ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని వైయస్ఆర్సీపీ కార్యాలయంలో శనివారం ఉదయం 9:30 గంటలకు గ్రామ అధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ జరుగనుందని వైఎస్ఆర్సిపి కన్వీనర్ మణి నాయుడు తెలిపారు. వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి పంచాయతీలోనూ గ్రామ అధ్యక్షులుగా ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

10వ తరగతి సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ఐదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్టు ఎంఈఓలు రవీంద్రనాధ్, మునిసుబ్రమణ్యంలు తెలిపారు. శుక్రవారం వారు బుచ్చినాయుడు కండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. విద్యార్థులు ఈ తరగతులకు తప్పక హాజరై ఉత్తీర్ణులు కావాలని సూచించారు. అయితే బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను గాలికి వదిలేసినట్లు సమాచారం. మంగళవారం రోజైతే పాఠశాలలో ఉపాధ్యాయులే లేరని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

సభ్యత్వ నమోదు కొండంత అండ



ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తకు సభ్యత్వ నమోదు కార్డు కొండంత అండగా ఉంటుందని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. శుక్రవారం చంద్రగిరి మండల పరిధిలోని మామిడిమానుగడ్డ గ్రామానికి చెందిన కందులవారిపల్లి ఉప సర్పంచ్ రాకేష్ చౌదరి జనవరి 18 వ తేదీన ఏనుగుల దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. రాకేష్ చౌదరి టిడిపి సభ్యత్వ నమోదు కార్డు ద్వారా కుటుంబసభ్యులు ప్రమాద భీమా నమోదు చేయించినందున, రాష్ట్ర పార్టీ కార్యాలయం నుండి 5 లక్షల ప్రమాద బీమా మంజూరు చేసిందని తెలిపారు. చెక్కును రాకేష్ చౌదరి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం నాయుడు, ఎస్ గౌస్ బాషా, బాలకృష్ణ, రమేష్ రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గం, వడమాలపేట మండలం, టి.సి.అగ్రహారం గ్రామానికి చెందిన ఆర్. వెంకటేష్‌కు రు.61,811 /- లు, సి.విజయకు రు.64,415 /- లు, టి.మురగా రెడ్డికి రు. 20,000 /- లు ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద మంజూరైన చెక్కులను నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, పార్టీ అధ్యక్షులు జానా వెంకటయ్య, ధనుంజయ నాయుడు, మహిళ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ ప్రసన్న, హైమావతి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రాపురం (తిరుపతి రూరల్) : శుక్రవారం తిరుపతి రూరల్ మండలం పరిధిలోని తనపల్లి రఘునాథ్



రిసార్ట్స్ లోని టీడీపీ కార్యాలయంలో తిరుపతి, పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాలకు సంబంధించిన పలువురికి అనారోగ్య , ఇతర సమస్యలతో బాధపడుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పులివర్తి నాని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, దినేష్ రెడ్డి, శ్రీరాములు, ధనంజయలు తదితరులు పాల్గొన్నారు.

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 295వ జయంతి ఉత్సవాలు శని, ఆదివారాల్లో తిరుపతి, తరిగొండలో వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అన్నమాచార్య కళామందిరంలో సాహితి సదస్సు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు భక్తి సంగీత కార్యక్రమాలు జరుగనున్నాయి. శనివారం ఉదయం 9 గంటలకు తిరుపతి ఎం.ఆర్.పల్లి సర్కిల్ వద్ద ఉన్న మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ విగ్రహానికి పుష్పాంజలి సమర్పించనున్నారు. తరిగొండలో ఆదివారం తరిగొండ శ్రీ లక్ష్మీనృసింహస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, ఆలయ ప్రాంగణంలో శ్రీ తరిగొండ వెంగమాంబకు పుష్పాంజలి, సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో గోష్టి గానం, హరికథ నిర్వహిస్తారు.

తిరుమలలో మాక్‌డ్రిల్



ప్రజాశక్తి - తిరుమల : జిల్లా ఎస్పి వి. హర్షవర్ధన్ రాజు అదేశాల మేరకు ఆక్టోపస్, సివిల్ పోలీసులు, ఏఆర్ పోలీసు బలగాలు, బాంబ్ డిస్పోస్ టీంలు, డాగ్ స్క్వాడ్ టీంలు నాలుగు టీంలుగా విడిపోయి ఎద్దైన అవాంఛనీయ సంఘటనలు జరిగితే ప్రజలను ఎలా రక్షించాలనే విషయమై తిరుమలలో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. భారతదేశం, పాకిస్తాన్ మధ్య యుద్ధవాతావరణం నెలకొనివున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు తిరుమలలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలుస్తోంది. అనుమానిత వ్యక్తులను ప్రశ్నించడంతో పాటు బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. తిరుమలకు వచ్చే వాహనాలు, మఠాలు, అతిథి గృహాలు, శ్రీవారిమెట్లు, స్థానిక నివాస ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల డిఎస్‌పి విజయ్ కుమార్, ఆక్టోపస్ డిఎస్పి విశ్వనాథం, టీటీడీ విజిఓ సురేంద్ర, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.